క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి విరాళం



రూ.25,116 విరాళం అందజేస్తున్న భక్తుడు రాజుబాబు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు తమ వంతు సాయం అందిస్తున్నారు. మునగపాక బైపాస్ రోడ్డులో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం విశాఖలో ఉంటున్న మునగపాక వాసి మద్దుల రాజుబాబు–సత్యవాణి దంపతులు రూ.25,116 విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆడారి అచ్చియ్యనాయుడు, కోనపల్లి రామ్మోహనరావు, పూసర్ల వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూలపేట గ్రామాభివృద్ధికి సహకరించాలి



మహిళలకు డస్ట్‌బిన్లు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మండలంలో మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మంగళవారం మూలపేట గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇక్కడ తడిపొడి చెత్త సేకరణ ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. ఇందుకోసం తడి, పొడి చెత్త సేకరణకు సంబంధించిన బుట్లు అందజేస్తున్నామన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, గ్రామ పెద్దలు ఆడారి జగన్నాథరావు, ఆడారి నాయుడు, నాగేంద్ర, నాగేశ్వరరావు, వెంకట అప్పారావు పాల్గొన్నారు.

లక్ష్మీ కళా యూనియన్ అధ్యక్షుడిగా శివాజీ

మునగపాక: లక్ష్మీ కళా యూనియన్ అధ్యక్షుడిగా పెంటకోట శివాజీ ఎన్నికయ్యారు. మంగళవారం మునగపాకలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా శివాజీ, కార్యదర్శిగా పెంటకోట సత్యనారాయణ, కోశాధికారిగా ఆడారి సూర్యచంద్రరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాటక రంగ దర్శకుడు దాడి ముసిలినాయుడు మాట్లాడుతూ కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ఏటా గ్రామంలో జరిగే పలు ఉత్సవాల సందర్భంగా యూనియన్ కళాకారులు మెరుగైన ప్రదర్శన ఇస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో నాటక రంగంలో మరింత ప్రావీణ్యం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో దాడి కొండలరావు, పెంటకోట సత్యనారాయణ, బుద్ద నాగు, చదరం వెంకట సూరప్పారావు, దాడి వీర, పెంటకోట సూరిబాబు, పెంటకోట శ్రీను, పక్కుర్తి కాశీ పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ సీఐలు మురళీమోహన్‌రావు, ప్రశాంతి

పాయకరావుపేట: మండలంలో పెదరాంభద్రపురం, ఈదటం గ్రామాల్లో దాడులు నిర్వహించి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు కె.మురళీమోహన్ రావు, వీఎల్ ప్రశాంతి దాడులు నిర్వహించి పెదరాంభద్రపురం, వీరవరపుపేట, ఈదటం గ్రామాలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారన్నారు. వీరిని యలమంచిలి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల ఆందోళన

రోలుగుంట: కొంతలం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు తమ బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలంటూ కేవీపీఎస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకుడు బాలరాజు మాట్లాడుతూ సుమారు 9 వారాలుగా వేతనాలు లేక లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 కూలీ గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల వద్ద మజ్జిగ, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

సంత.. అదో క వింత!



- ఒకప్పుడు సంతంటే పండగ
- పిచ్చాపాటి కబుర్లకు వేదిక
- ఆ రోజు ఇంట్లో అంతా సందడే
- నాన్న తెచ్చిన సంచిలో వెతుకులాట
- కిరాణా దుకాణాలు, మాల్స్ రాకతో సంతల కనుమరుగు

కోటవురట్ల: పల్లెలకు వారపు సంతలే ప్రధాన అంగడి... ఇంటిల్లిపాదికి వారానికి సరిపడా సరంజామా కొనాలన్నా, పంట ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా వాటిపైనే ఆధారపడేవారు. కిరాణా సరుకుల నుంచి వస్త్రాలు, తాజా కూరగాయలు, తినుబండారాలు, మసాలా దినుసులు, పిల్లల ఆటబొమ్మలు, ఇలా ఒకటేమిటి ఏం కావాలన్నా సంతలో ఓ రౌండ్ వేయాల్సిందే. తాలూకా కేంద్రంలో వారంలో ఒక రోజు పెద్ద సంత జరిగితే చుట్టూ ఉన్న గ్రామాల్లో రోజుకో సంత జరిగేది. కూరగాయలకు పల్లెల్లోని సంతలకు, కిరాణా కోసం వారం పూట తాలూకా కేంద్రానికి వెళ్లి సరుకులు పట్టుకెళ్లేవారు.

ఏ సంతకు వెళ్లాలన్నా బంధువులు, స్నేహితులు అంతా కలిసి పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి కావలసిన సమస్త సరుకులను కొనుగోలు చేసి ఇంటికి పట్టుకెళ్లేవారు. నాన్న సంతకెళ్లాడంటే.. ఆ రోజు ఇంట్లో సందడే. సంత నుంచి నాన్న ఎప్పుడొస్తాడా అని పిల్లలు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసేవారు. సంచితో నాన్న ఇంట్లోకి అడుగెట్టగానే దాన్ని వెతికేసుకునేవారు. తినడానికి చిన్న జంతికలు పొట్లాం తెచ్చినా వారి కళ్లల్లో సంతోషం వెలకట్టలేనంతగా ఉండేది. ఆ రోజులు పోయాయి. సంతలు ఒక్కొక్కటిగా అంతరించిపోతున్నాయి. పల్లెలు కూడా అభివృద్ధి చెందడంతో వీధికో కిరాణా దుకాణం, కూరగాయల కొట్టు వచ్చేసింది. దాంతో సంతల ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. తరతరాలుగా వస్తున్న వారపు సంతలు కనుమరుగవుతున్నాయి. మండలానికి ఒక్కటో రెండో సంతలు మాత్రమే కొనసాగుతున్నాయి.



సంతకోసం కూరగాయలు సర్దుతున్న వ్యాపారి

జల్లూరు సంతకి పోదాం పద..

మండల కేంద్రంలో ప్రతీ శనివారం సంత జరిగేది. ఇక్కడ కిరాణా నుంచి కూరగాయలు వరకు అన్నీ దొరికేవి. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి కావలసినవన్నీ కొనుగోలు చేసుకెళ్లేవారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో ఈ సంత కళ తప్పుతూ వచ్చింది. విక్రయించేవారు రావడం మానేశారు. దాంతో కొనుగోలుదారుల సంఖ్య తగ్గిపోయింది. అదే సమయంలో జల్లూరు సంతకు మంచి డిమాండ్ వచ్చింది. ప్రతీ సోమవారం జరిగే ఈ సంతకు సమీప గ్రామాల నుంచే కాకుండా మండల కేంద్రం నుంచి పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు వస్తారు. జల్లూరు మెయిన్‌రోడ్డులో ఈ సంత జరుగుతోంది. మధ్యాహ్నం 2 గంటలకు మొదలైన సంత సాయంత్రానికి పుంజుకుంటోంది. జనంతో కిటకిటలాడుతోంది. ఇక్కడ స్థానికంగా రైతులు తాము పండించే కూరగాయలను తాజాగా విక్రయిస్తారు. తాజాగా ఉండడమే కాకుండా బేరాలాడితే తక్కువ ధరకే లభిస్తాయి. దాంతో జల్లూరు సంతంటే ఓ క్రేజ్ వచ్చింది. కూరగాయలతో పాటు చేపలకు ఈ సంత ప్రసిద్ధి. సమీప గ్రామాలైన యండపల్లి, అన్నవరం, బి.కె.పల్లి, రామచంద్రపాలెం, నీలిగుంట, సన్యాసిరాజుపాలెం, తంగేడు, సుంకపూరు, కోటవురట్ల, కైలాసపట్నం, లింగాపురం తదితర గ్రామాల నుంచి ఈ సంతకు తరలివస్తారు.

కొత్త పరిచయాలు పెరుగుతున్నాయి



జల్లూరు సంతకు వెళ్తే ఎంతో ఆనందమేస్తోంది. తాజా కూరగాయలతో పాటు సముద్రపు చేపలు మార్కెట్లో కంటే కాస్త చౌకగా దొరుకుతాయి. ప్రతి సోమవారం ఇక్కడి రైతుల వద్ద కొనడం వల్ల స్నేహం ఏర్పడుతోంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా అరువు ఇస్తుంటారు. కొత్త వ్యక్తులతో పరిచయాలు పెరుగుతున్నాయి.

–పెట్ల రాంబాబు, ఎంపీటీసీ, బి.కె.పల్లి

సదుపాయాలు కల్పించాలి..



జల్లూరు సంతకు మంచి పేరుంది. ఇక్కడకు ఎక్కువ మంది కొనుగోలుకు వస్తుంటారు. మండలంలోని అన్ని సంతలు కళ తప్పాయి. డిమాండ్ ఉన్న ఈ సంతను అభివృద్ధి చేస్తే బాగుంటుంది. సంతకు విశాలమైన స్థలాన్ని కేటాయించి కనీస సదుపాయాలు కల్పించాలి.

– గొర్లు నానిబాబు, యండపల్లి

పల్లెల్లో పండగల సందడి



ఇందేశమ్మతల్లిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల: పల్లెలో మంగళవారం గ్రామ దేవతల పండగలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. బంధువులు, స్నేహితుల రాకతో లోగిళ్లు కళకళలాడాయి. మండలంలోని చౌడువాడలో చిట్టిపైడితల్లి అమ్మవారి జాతర, పందూరులో ఇందేశమ్మతల్లి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామాలు విద్యుద్దీపాలంకరణతో కనువిందు చేశాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందేశమ్మవాక వద్ద అమ్మవారిని పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల పండుగలు ఐక్యతను చాటుతాయన్నారు. బంధువులు, స్నేహితులు మంచి వాతావరణంలో కలుసుకునేందుకు మంచి తరుణమన్నారు. సర్పంచ్ చీకట్ల జగదీష్, మాజీ సర్పంచ్ గెంజి రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాల స్వాధీనం

కశింకోట: మండలంలోని లాలంకొత్తూరు గ్రామంలో అక్రమంగా గోనె సంచిలో తరలిస్తున్న 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి. మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కొండపు సత్యనారాయణ(42)ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం తరించినా విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



ఉద్దండపురంలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ఉమాప్రసాద్

నక్కపల్లి: మండలంలో రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా వ్యవసాయ అధికారుల సూచనలతో పంటలు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన ఉద్దండపురంలో భూసార పరీక్షలను నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలనేవి మూడు దశల్లో నిర్వహించాలన్నారు. మొదట మట్టి నమూనాలు సేకరించాలన్నారు. భూసార పరీక్షలకు వేసవి చాలా అనువైనదన్నారు. పొలమంతా ఒకే రకంగా ఉన్నప్పుడు 5–6 ఎకరాల విస్తీర్ణానికి ఒక నమూనా సరిపోతుందన్నారు. 10 నుంచి 12 చోట్ల వై ఆకారంలో గుంత పెట్టి 15 సెంటీమీటర్ల లోతున మట్టి సేకరించాలన్నారు. పండ్ల తోటల్లో 1 సెంటీమీటరు లోతున మట్టి సేకరించాలన్నారు. సేకరించిన మట్టిని శుభ్రమైన బకెట్‌లో వేయాలన్నారు. మట్టిని పాలిథిన్ కవర్ లేదా గోనె సంచిలో ఉంచి నాలుగు భాగాలుగా విభజించి ఎదురెదురుగా ఉన్న భాగాలను తీయాలన్నారు. ఈ విధంగా చాతుర్విభజన పద్ధతి ద్వారా అర కిలో మట్టి మిగిలే వరకు చేయాలన్నారు, మట్టిని నీడలో ఆరబెట్టి శుభ్రమైన సంచిలోకి తీసుకుని రైతుల వివరాల పట్టిక పేరు, చిరునామ, సర్వే నంబరు, పంట వివరాలు సమస్యలు జతపరచి పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. పరీక్షా కేంద్రంలో వచ్చిన ఫలితాల ఆధారంగా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ విధంగా చేస్తే రైతులు మంచి దిగుబడులు సాధించడంతోపాటు, చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవరుచుకోవాలి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ బద్దెం సూర్యనారాయణ

మునగపాక: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని డాక్టర్ బద్దెం సూర్యనారాయణ కోరారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు మునగపాక బీసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బొడ్డేడ మినరల్ వాటర్ ప్లాంట్ పదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన కేక్ కట్ చేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ జెడ్పీటీసీ మళ్ల సందీపరావు, పెద్దలు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట జగన్నాథరావు మాస్టారు, అలంక ప్రకాశరావు, టెక్కలి కొండలరావు, కోనపల్లి రామ్మోహనరావు, రాజాన బుజ్జిబాబు, ఆడారి కాశీబాబు, మద్దాల వీరునాయుడు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి శ్రీకాంత్, పెంటకోట సత్యనారాయణ, పెంటకోట శ్రీనివాసరావు(నెట్), వార్డు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పలకరించిన వరుణుడు



కోటవురట్లలో కురుస్తున్న వర్షం



రేగుపాలెం వద్ద పాత జాతీయ రహదారిపై మోకాలు లోతున నిలిచిన వర్షపు నీరు

కోటవురట్ల: చాన్నాళ్లకు వరుణుడు పలకరించాడు. ఇటీవల ఎండలు మండిపోతుండడంతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడగాల్పులకు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం అయినా వేడిగాలులు తగ్గడంలేదు. ఈ పరిస్థితుల్లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చేసుకుని సుమారు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. దాంతో వాతావరణం చల్లబడి జనాలు ఉపశమనం పొందారు.

యలమంచిలిలో భారీ వర్షం

యలమంచిలి రూరల్: మండుతున్న ఎండల ధాటికి అల్లాడుతున్న ప్రజలు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. రెండ్రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, ఉక్కబోతతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణ శాఖ ప్రకటించిన విధంగానే వరుణుడు కరుణించడంతో యలమంచిలి పట్టణం, మండలం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు, 16వ నంబరు జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. రేగుపాలెం వద్ద పాత జాతీయ రహదారిపై మోకాలి లోతున నీరు ఉండిపోవడంతో ద్విచక్రవాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. అయితే రెండ్రోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ ప్రకటన ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



ఎంపీడీవోలతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం: వేసవి తీవ్రత నేపథ్యంలో నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఎస్‌టీబీఎల్‌లో తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలు శాఖల అధికారులతో విడివిడిగా మంగళవారం ఆయన సమీక్షించారు. విద్యా శాఖ, ఆర్అండ్‌బీతో పాటు, ఎంపీడీవోలతో సమావేశమై పనుల పురోగతి, నిధుల వ్యయం గురించి ఆరా తీశారు.

వేతనదారులకు బేసిన్ల పంపిణీ



వేతనదారులకు బేసిన్లు అందజేస్తున్న కూటమి నేతలు

మునగపాక: ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయని కూటమి నేతలు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్ తెలిపారు. టీడీపీ సీనియర్ నేత మళ్ల వరహా నరసింగరావు జన్మదినం సందర్భంగా మంగళవారం ఉపాధి కూలీలకు ఉచితంగా బేసిన్లు అందజేశారు. కార్యక్రమంలో మళ్ల రాజేష్, మళ్ల శేషు, గుబ్బల సత్యనారాయణ, తురాయి మోహన్, మళ్ల మణి, ఆడారి నూక సత్యవతి, కొయిలాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చోడమాంబిక గుడికి ఉచిత ఆటో సేవ



ఉచిత ఆటోలు సర్వీసులు నడుపుతున్న దృశ్యం

అచ్యుతాపురం: చోడపల్లిలో చోడమాంబిక పండుగను పురస్కరించుకొని మోసయ్యపేటకు చెందిన సాయి శక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆటో సేవలు నిర్వహించారు. మోసయ్యపేట నుంచి చోడపల్లి అమ్మవారి ఆలయానికి భక్తులు చేరుకునేందుకు ఉచిత ఆటో సర్వీసు ఏర్పాటు చేశారు. అదే విధంగా భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దమ్ము, చండి, పోలవరపు అప్పారావు, తట్టా రాజు, సన్నిబాబు, దుర్గ, మురళీ, సూరిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గొర్లివానిపాలేనికి ట్రాక్టర్ అందజేత

పరవాడ: లారస్ ల్యాబ్స్ సహకారంతో గొర్లివానిపాలెం గ్రామాభివృద్ధికి సమకూర్చిన ట్రాక్టర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహారావు కోరారు. లారస్ ల్యాబ్స్ ఆర్థిక సాయంతో సమకూర్చిన ట్రాక్టర్‌ను సర్పంచ్ గొర్లి గోపి అమ్మలుకు మంగళవారం అందించారు. గ్రామాభివృద్ధితోపాటు, గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి సహకరించిన లారస్ ల్యాబ్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

26న హనుమాన్ శోభాయాత్ర



శారదానది ఒడ్డు పరిసరాలను పరిశీలిస్తున్న పరమేశ్వరరావు, కుమారస్వామి

అనకాపల్లి: హనుమాన్ శోభాయాత్ర ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు సుంకరమెట్ట జంక్షన్ నుంచి మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వరకూ నిర్వహించనున్నట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సభ్యుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, వినాయక విగ్రహ నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి తెలిపారు. స్థానిక శారదానది ఒడ్డున గంగాహారతి ఇచ్చేందుకు మంగళవారం వారు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హనుమాన్ దేవాలయం వరకు వేల సంఖ్యలో హిందువులు జైశ్రీరామ్ అనే నామస్మరణతో ఈ యాత్రలో పాల్గొంటారన్నారు. సాయంత్రం ఆరు గంటలకు శారదానది ఒడ్డున హనుమాన్ హారతి ఇస్తారన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సభ్యులు నడిపూరి అనిల్ కుమార్, ఏసీహెచ్ బాబు, జేపీ కొండలరావు, కొణతాల అప్పలరాజు, ఆడారి రాజు, కొణతాల హరినాథ్ బాబు, డీవీ రాజేష్, ఆళ్ల గౌతమ్ పాల్గొన్నారు.

కొండలు పిండేస్తున్నా.. పట్టని అధికారులు

రేయింబవళ్లు ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు



తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలో యంత్రంతో కొండను తవ్వేస్తున్న దృశ్యం



గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు

మునగపాక: కూటమి అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మండలంలో కొండలను పిండేసి గ్రావెల్ తరలించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూ, మైన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలోని మరిడిమాంబ గుడిని ఆనుకొని యంత్రాలతో గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. రేయింబవళ్లు అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా గ్రావెల్ తరలిస్తున్నారు. కొండలు తవ్వేయడంతో పర్యావరణానికి హాని కలుగుతుందంటూ అధికారులు ప్రకటనలు చేయడం తప్పా అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయడం లేదు. గ్రావెల్ తరలింపును నిరోధించాల్సిన మైన్స్, రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. గ్రావెల్ తరలింపు వెనుక తోటాడ పంచాయతీ పరిధిలోని అధికార పార్టీకి చెందిన నేత హస్తం ఉన్నట్టు తెలుస్తోంది. గ్రావెల్ అక్రమ తరలింపునకు సంబంధించి తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, పాటిపల్లి వీఆర్వోల వివరణ కోరేందుకు ఫోన్ చేయగా, రెస్పాన్స్ లేదు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



యలమంచిలి బస్టాండు కూడలి వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది



బస్టాండులో ప్రయాణికులకు కరపత్రాలు పంచిపెడుతున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం యలమంచిలి పట్టణం ఆర్టీసీ బస్టాండు వద్ద స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది డెమో నిర్వహించారు. వాటర్ ద్వారా అగ్ని ప్రమాదాలను ఏ విధంగా ఆర్పివేయాలో ప్రజలకు వివరించారు. కరపత్రాలు, గోడ పత్రికలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలను నివారించడానికి నిర్వహించిన డెమోను స్థానికులు, బస్సు ప్రయాణికులు ఆసక్తిగా చూశారు. కార్యక్రమంలో యలమంచిలి అగ్నిమాపక కేంద్రం అధికారి డి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అలరించిన పిల్లల సాంస్కృతిక ప్రదర్శన



ఆకట్టుకున్న బుర్రకథ

మునగపాక: స్థానిక బీసీ కాలనీలో సోమవారం రాత్రి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, బీచ్ బాయ్స్ ఆధ్వర్యంలో పలువురు నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, బుర్రకథ, రంగుల రాట్నం, సినీ హీరోల డూప్ డ్యాన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. వేడుకలను తిలకించేందుకు వచ్చిన వారందరికీ నిర్వాహకులు మిఠాయిలు, ఐస్‌క్రీమ్స్ అందజేశారు.